

దుండగుల దాడిలో ధ్వంసమైన పరికరాలు, ఫర్నీచర్

# అర్ధరాత్రి అట్టుడికిన బెంగాల్

- **జూనియర్ డాక్టర్ హత్యాచారంపై మహిళల నిరసన**
- **ఆర్‌జీ దవాఖానలో అర్ధరాత్రి దుండగుల విధ్వంసం**
- **పోలీసులపై రాళ్లు.. 9 మంది నిందితుల అరెస్టు**

కోల్‌కతా, ఆగస్టు 15: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ దవాఖానలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై అర్ధరాత్రి పశ్చిమబెంగాల్ అట్టుడికింది. 'స్వాతంత్ర్యం వచ్చిన అర్ధరాత్రి మహిళల స్వాతంత్ర్యం కోసం' అంటూ నిర్వహించిన ఆందోళన హింసాత్మకంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మహిళలు అర్ధరాత్రి నిరసన వ్యక్తం చేశారు. నిరసనకారులుగా పేర్కొంటూ సుమారు 40 మంది గుంపు గురువారం అర్ధరాత్రి ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. దవాఖాన ప్రాంగణంలోకి చేరుకున్న ఆందోళనకారులు ఎమర్జెన్సీ విభాగాన్ని, నర్సింగ్ స్టేషన్, మందుల స్టోర్, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఆందోళనకారులను అదుపుచేయడానికి పోలీసులు బాష్ప వాయువును ప్రయోగించారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. విధులలో ఉన్న తమకు రక్షణ కల్పించాలంటూ నర్సులు ఆందోళన చేశారు. తాము చేస్తున్న ఆందోళనను నైతికంగా దెబ్బతీయడానికే దవాఖానపై దాడి చేశారని, అయితే న్యాయం కోసం తమ ఆందోళన కొనసాగుతుందని డాక్టర్లు స్పష్టం చేశారు.

**మమత రాజీనామా చేయాలి**

హింసాత్మక ఘటనలకు బాధ్యత వహిస్తూ మమతా బెనర్జీ సీఎం పదవికి రాజీనామా చేయాలని విపక్ష బీజేపీ డిమాండ్ చేసింది. డాక్టర్ మృతికి నిరసగా కాళీఘాట్‌లోని సీఎం ఇంటి ముందు శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తామని బీజేపీ మహిళా విభాగం ప్రకటించింది. ఆందోళన చేస్తున్న డాక్టర్లకు రక్షణ కల్పించడంలో, హింసను నిరోధించడంలో మమత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పరిస్థితిని మమత ప్రభుత్వం అదుపు చేయలేకపోతే ఆర్మీని దింపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ డిమాండ్ చేశారు.

**స్తంభించిన వైద్య సేవలు..**

జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. గత ఏడు రోజుల నుంచి ఆరోగ్య సేవలు స్తంభించగా, తమ సహచర విద్యార్థినికి న్యాయం చేయాలంటూ జూనియర్ డాక్టర్లు ఆందోళన కొనసాగిస్తున్నారు. చాలా ప్రభుత్వ దవాఖానలలో ఇప్పటికే ఔట్ పేషంట్, అత్యవసర సేవలు నిలిచిపోవడంతో సేవలందక రోగులు అల్లాడుతున్నారు. కాగా, దవాఖానను గురువారం సందర్శించిన గవర్నర్ బోస్ ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లతో మాట్లాడారు.

### రాష్ట్రంలో అశాంతిని సృష్టించడానికే: మమత

రాష్ట్రంలో అశాంతిని సృష్టించడానికి సీపీఐ(ఎం), బీజేపీ ఈ విధ్వంసానికి పాల్పడ్డాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. తాను ఈ విషయంలో విద్యార్థులు, ఆందోళన చేస్తున్న డాక్టర్లను తప్పుబట్టడం లేదని అన్నారు. ఆర్‌జీ కార్ దవాఖానలో విధ్వంసం సృష్టించింది బయటివారేనని ఆమె అన్నారు. బాధిత మహిళా డాక్టర్‌కు న్యాయం జరగాలంటూ శుక్రవారం తాను వీధుల్లోకి రానున్నట్టు ఆమె ప్రకటించారు.

# లౌకిక పౌరస్మృతి తక్షణావసరం

- ఇప్పుడున్నది మతపరమైన పౌరస్మృతి
- ఇది దేశాన్ని మతం ఆధారంగా విభజిస్తున్నది
- తరచూ ఎన్నికలతో దేశాభివృద్ధికి ఆటంకం
- జమిలి ఎన్నికలకు పార్టీలు ముందుకు రావాలి
- బంగ్లాదేశ్‌లోని హిందువుల భద్రతపై 140 కోట్ల మంది భారతీయుల్లో ఆందోళన
- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 15: దేశంలో లౌకిక పౌర స్మృతి తక్షణ అవసరమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీలోని ఎర్రకోటలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. 'ఇప్పుడు ఉన్న పౌర స్మృతి మతపరమైన పౌరస్మృతి అని సమాజంలోని ఎక్కువ మంది నమ్ముతున్నారు. ఇందులో నిజం ఉంది. మనం 75 ఏండ్లు మతపరమైన పౌర స్మృతితో జీవించాం. వివక్షను ప్రోత్సహించే పౌర స్మృతితో జీవించాం. ఇది దేశాన్ని మతప్రాతిపదికన విభజించడంతో పాటు అసమానతలను ప్రోత్సహిస్తున్నది. ఇప్పుడు మనం లౌకిక పౌర స్మృతి దిశగా పయనించాల్సి ఉంది. దేశానికి లౌకిక పౌర స్మృతి తక్షణ అవసరం. రాజ్యాంగ స్ఫూర్తి కూడా ఇదే. సుప్రీంకోర్టు కూడా దీని అవసరాన్ని అనేక సార్లు నొక్కి చెప్పింది. రాజ్యాంగ నిర్మాతల కలను నెరవేర్చాలి.' అని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ ఘటనలను ఆయన ప్రస్తావిస్తూ ఆ దేశంలోని హిందువులు, ఇతర మైనారిటీల భద్రత పట్ల 140 కోట్ల మంది భారతీయులు ఆందోళనతో ఉన్నారని అన్నారు. దేశంలో తరచూ ఎన్నికలు జరుగుతుండటం వల్ల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతున్నదని, జమిలి ఎన్నికలకు రాజకీయ పార్టీలు ముందుకు రావాలని ఆయన కోరారు. మహిళలపై అకృత్యాలకు పాల్పడే వారికి విధించే శిక్షలకు విస్తృత ప్రచారం కల్పించాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆడవాళ్లపై దారుణాలకు పాల్పడితే ఉరిశిక్ష పడుతుందనే భయం నేరస్తుల్లో రావాలన్నారు.

**దేశానికి ఇది స్వర్ణయుగం**

భారతదేశానికి ముఖ్యంగా ప్రపంచ కోణంలో ఇది స్వర్ణయుగమని, ఆ అవకాశాన్ని వదులుకోవద్దని మోదీ ప్రజలను కోరారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తున్నారని, రాష్ట్రాలు స్పష్టమైన విధానాలు రూపొందించి పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. పెట్టుబడులు పెట్టాల్సింది రాష్ట్రాల్లో కాబట్టి కేంద్రం మాత్రమే ఈ పని చేయలేదని ప్రధాని పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి చెందిన, సుసంపన్న దేశంగా మారాలనే లక్ష్యాన్ని అందుకోవాలంటే 140 కోట్ల మంది భుజం భుజం కలిపి నడవాలన్నారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధిస్తామని పేర్కొన్నారు. రాజకీయాల్లోకి కొత్త రక్తం రావాలని, రాజకీయ కుటుంబ నేపథ్యం లేని లక్ష మంది యువత ప్రజాజీవితంలోకి రావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఐదేండ్లలో 75 వేల కొత్త వైద్య విద్య సీట్లను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. దేశం ఎదుగుదలను జీర్ణించుకోలేని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలకు సూచించారు. ఇలాంటి వక్రబుద్ధి ఉన్న గుప్పెడు మంది కూడా అస్థిరతకు బాటలు వేయవచ్చని, అన్నీ నాశనం చేయాలని వారు కలలు కంటున్నారని ఆరోపించారు. కాగా, మోదీది ఇది 11వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం.ఈసారి ఆయన 98 నిమిషాల పాటు ప్రసంగించి రికార్డు సృష్టించారు.

**అంబేద్కర్‌ను అవమానించడమే: ప్రతిపక్షాలు**

ఇప్పుడు దేశంలో ఉన్నది 'మతపరమైన పౌర స్మృతి' అని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. మోదీ వ్యాఖ్యలు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవమానించడమే అని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. 'విద్వేషం, అపహాస్యం, చరిత్రను వక్రీకరించడంలో మానవాతీత ప్రధానమంత్రి సామర్థ్యానికి అవధులు లేవు. ఎర్రకోట నుంచి వీటిని ఆయన పూర్తిగా ప్రదర్శించారు. ఇప్పటివరకు మతపరమైన పౌరస్మృతి ఉందని అనడం అంటే హిందూ పర్సనల్ చట్టాల్లో సంస్కరణలు తీసుకువచ్చిన అంబేద్కర్‌ను తీవ్రంగా అవమానించడమే. ఈ సంస్కరణలను బీజేపీ, జన్‌సంఘ్ వ్యతిరేకించింది' అని పేర్కొన్నారు. మోదీ ప్రసంగంపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా స్పందిస్తూ.. దేశాన్ని ఏకం చేసేందుకు, ప్రజల్లో స్ఫూర్తి నింపే అంశమేదీ ప్రసంగంలో లేదని, ఆర్ఎస్ఎస్ విభజన అజెండా ప్రకారమే మోదీ మాట్లాడారని ఆరోపించారు. దేశంపై ఏకరూపతను రుద్దేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రధాన మంత్రి సంకుచిత బుద్ధిని వదులుకుంటారని అనుకున్నప్పుడల్లా ఆయన నిరాశపరుస్తున్నారని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా అన్నారు.

**రాహుల్ గాంధీ సీటుపై వివాదం**

ఎర్రకోట వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఐదో వరుసలో సీటు కేటాయించడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టింది. 'చిన్న బుద్ధి ఉన్న వారి నుంచి పెద్ద పనులు ఆశించడం వ్యర్థమే. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఐదో వరుసలో కూర్చునేలా చేయడం ద్వారా మోదీ తన ఫ్రస్ట్రేషన్‌ను చాటుకున్నారు.' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేథ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

### స్వేచ్ఛ, స్వాతంత్ర్యం విలువను
## బంగ్లా పరిణామాలు గుర్తుచేశాయ్
**సీజేఐ డీవై చంద్రచూడ్**

న్యూఢిల్లీ, ఆగస్టు 15: మనకు లభించిన స్వాతంత్ర్యం, స్వేచ్ఛ ఎంతో ముఖ్యమైనవని, ఈ హక్కుల విలువ ఏమిటో ఇటీవల మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో జరిగిన పరిణామాలు మనకు గుర్తు చేస్తున్నాయని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఆ దేశ ప్రధాని హసీనా రాజీనామా చేసి దేశాన్ని వదిలిపెట్టి వెళ్లగా, ఆ దేశంలో మైనారిటీగా ఉన్న హిందువులపై విస్తృతంగా దాడులు జరుగుతున్న క్రమంలో సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం సుప్రీం కోర్టు ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిణామాలు మనకు స్వేచ్ఛ ఎంత విలువైనదో తెలియజేస్తున్నాయని అన్నారు.

## గిన్నిస్‌కెక్కిన జాతీయ గీతాలాపన




న్యూఢిల్లీ, ఆగస్టు 15: జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామీ విజేత రిక్కీ కేజ్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ గీతాలాపన గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. యూకేకు చెందిన 100 మందితో కూడిన రాయల్ ఫిలార్మోనిక్ ఆర్కెస్ట్రా, మన దేశానికి చెందిన హరిప్రసాద్ చౌరాసియా, రాకేశ్ చౌరాసియా, రాహుల్ శర్మ, అమాన్, అయాన్ అలీ బంగాశ్, రాహుల్ శర్మ, జయంతి కుమరేశ్, షేక్, కలీషాబి మహబూబ్, గిరిధర్ ఉడుప వంటి సంగీతవేత్తలు కలిసి జాతీయ గీతానికి సంగీతాన్ని ఇచ్చారు. కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన 14 వేల మంది ఆదివాసీ చిన్నారులు భారతదేశ చిత్రపటం, భారత్ అనే అక్షరక్రమంలో నిల్చొని జాతీయ గీతాలాపన చేశారు. ఈ వీడియోను రిక్కీ కేజ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.



### 'అగ్ని మిస్సైల్ మ్యాన్' అగర్వాల్ కన్నుమూత

హైదరాబాద్, ఆగస్టు 15: అగ్ని క్షిపణి పితామహుడిగా గుర్తింపు పొందిన ఆర్ఎన్ అగర్వాల్ (84) గురువారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన నేతృత్వంలో 1983లో అగ్ని క్షిపణి తయారీ ప్రోగ్రాంను భారత్ మొదలుపెట్టింది. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యం కలిగిన దేశాల సరసన భారత్‌ను నిలపటంలో ఆయన కృషి ఉంది. ప్రస్తుతం అత్యంత శక్తివంతమైన క్షిపణి 'అగ్ని-5' రేంజ్ 5వేల కిలోమీటర్లు. అగ్ని మిస్సైల్ మ్యాన్‌గా, అగ్నివాల్‌గా ఆయన గుర్తింపు పొందారు. భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్‌తో సత్కరించింది. అగ్ని, పృథ్వి, ఆకాశ్, నాగ్, త్రిశూల్ క్షిపణి తయారీ 'ఐజీఎండీపీ'లో ఆయన పాలుపంచుకున్నారు.

### గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా 'మంకీపాక్స్'

వాషింగ్టన్, ఆగస్టు 15: ఆఫ్రికా దేశాల్లో 'మంకీపాక్స్' వైరస్ వ్యాప్తి అత్యంత ఆందోళనకర స్థాయికి చేరుకుందని, ఇక్కడి పరిస్థితి అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే విధంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకటించింది. గ్లోబల్ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీని విధిస్తున్నట్టు తాజాగా హెచ్చరికలు జారీచేసింది. ఈ నేపథ్యంలో భారత్ సహా 196 సభ్య దేశాలు అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. డబ్ల్యూహెచ్‌వో సభ్య దేశాలకు అత్యున్నత స్థాయి ప్రమాద హెచ్చరికను జారీచేసింది. డబ్ల్యూహెచ్‌వో చీఫ్ టెడ్రోస్ అధనోమ్ మాట్లాడుతూ, 'ఎమర్జెన్సీ కమిటీ సూచన మేరకు గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటిస్తున్నాం' అని అన్నారు. వ్యాధి సోకితే తీవ్రమైన కండరాల నొప్పి, జ్వరం వస్తాయి.

### నర్సుపై లైంగికదాడి, హత్య

లక్నో: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన మరువక ముందే యూపీలో ఒక నర్సు సైతం హత్యాచారానికి గురైయ్యారు. ఉత్తరాఖండ్‌లోని ఒక ప్రైవేట్ దవాఖానలో పనిచేస్తున్న నర్సు జూలై 30న ఇంటికి చేరుకోలేదు. 8 రోజుల తర్వాత ఆగస్టు 8న తన ఇంటికి 1.5 కి.మీ దూరంలోని దిబ్దిబా గ్రామంలో యూపీ పోలీసులు ఆమె మృతదేహన్ని గుర్తించారు. ఆమె తన నివాస భవనంలోకి వెళ్తుండగా, దాడి చేసి పొదల్లోకి లాక్కుపోయానని, తర్వాత లైంగిక దాడి జరిపి హత్య చేసినట్టు నిందితుడు అంగీకరించాడు.

### ఉద్యోగినులకు నెలసరి సెలవు
**ఒడిశా ప్రభుత్వం నిర్ణయం**

భువనేశ్వర్, ఆగస్టు 15: ఒడిశాలో ఉద్యోగినులకు ఒకరోజు నెలసరి సెలవును ఇవ్వనున్నట్టు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిదా ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేసే ఉద్యోగినులు వేతన చెల్లింపుతో కూడిన నెలసరి సెలవును తీసుకోవచ్చని పేర్కొన్నారు. అయితే, ఈ సెలవు ఐచ్ఛికమని తెలిపారు. కటక్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి హాజరైన తర్వాత ఆమె ఈ ప్రకటన చేశారు. మహిళ రుతు చక్రంలోని మొదటి లేదా రెండో రోజు ఈ సెలవు తీసుకోవచ్చని వెల్లడించారు.

# ఒత్తిడితో వైద్య విద్యార్థుల చిత్తు

- **నలుగురిలో ఒకరికి మానసిక సమస్యలు**
- **ముగ్గురిలో ఒకరికి ఆత్మహత్య ఆలోచనలు**
- **ఎన్ఎంసీ టాస్క్‌ఫోర్స్ సర్వేలో వెల్లడి**



న్యూఢిల్లీ, ఆగస్టు 15: వైద్య విద్యార్థులు విపరీతమైన ఒత్తిడితో చిత్తవుతున్నారని, మానసిక సమస్యల బారిన పడుతున్నారని జాతీయ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నివేదిక పేర్కొన్నది. ప్రతి నలుగురు ఎంబీబీఎస్ విద్యార్థుల్లో ఒకరు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రతి ముగ్గురు పీజీ విద్యార్థుల్లో ఒకరిలో ఆత్మహత్య ఆలోచనలు కూడా వచ్చాయని తెలిపింది. ఎన్ఎంసీ ఏర్పాటుచేసిన 'నేషనల్ టాస్క్‌ఫోర్స్ ఫర్ మెంటల్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్' వైద్య విద్యార్థులపై ఏప్రిల్ 26 నుంచి మే 6 వరకు ఒక ఆన్‌లైన్ సర్వే నిర్వహించింది. ఇందులో 25,590 మంది అండర్ గ్రాడ్యుయేట్, 5,337 మంది పీజీ వైద్య వైద్యార్థులు, 7,035 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. యూజీ విద్యార్థుల్లో 27.8 శాతం, పీజీ విద్యార్థుల్లో 15.3 శాతం మంది తాము మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నట్టు స్వచ్ఛందంగా తెలిపారని ఈ నివేదిక పేర్కొన్నది.

**విద్యార్థుల్లో ఆత్మహత్యల ఆలోచనలు**

యూజీ విద్యార్థుల్లో 16.2 శాతం మంది, పీజీ విద్యార్థులు 31.2 శాతం మందికి ఆత్మహత్య ఆలోచనలు వచ్చినట్టు ఈ నివేదిక తెలిపింది. గత ఏడాదిలో 564 మంది పీజీ విద్యార్థులు తాము ఆత్మహత్య చేసుకునేందుకు ప్రణాళికలు వేసుకున్నామని, 237 మంది పీజీ విద్యార్థులు ఆత్మహత్యకు ప్రయత్నించామని సైతం సర్వేలో ఒప్పుకున్నట్టు ఈ నివేదిక పేర్కొన్నది. ఇలాంటి ఆలోచనలు ఉన్న వారిలో కొందరు మానసిక వైద్య సహాయాన్ని ఆశిస్తుండగా, ఇంకొందరు వద్దనుకుంటున్నారు.

**సర్వేలో తేలిన మరిన్ని అంశాలు**

- 45 శాతం మంది పీజీ విద్యార్థులు వారానికి 60 గంటలకు పైగా పని చేస్తున్నామని చెప్పారు.
- 56 శాతం మంది పీజీ విద్యార్థులు తమకు వారాంతపు సెలవులు లభించడం లేదని తెలిపారు.
- 9.7 శాతం మంది ఎంబీబీఎస్ విద్యార్థులు, 18 శాతం మంది పీజీ విద్యార్థులు తాము ర్యాగింగ్‌కు గురైనట్టు చెప్పారు.
- 41.6 శాతం మంది ఎంబీబీఎస్ విద్యార్థులు హాస్టళ్లలో సౌకర్యాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ఎన్ఎంసీ చేసిన కీలక ప్రతిపాదనలు**

వైద్య విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో ఎన్ఎంసీ పలు కీలక ప్రతిపాదనలు చేసింది.

- రెసిడెంట్ డాక్టర్లు వారానికి 74 గంటల కంటే ఎక్కువ పని చేయొద్దు. వారానికి ఒక రోజు కచ్చితంగా సెలవు తీసుకోవాలి.
- వైద్య విద్యార్థులు సెలవు అడిగినప్పుడు పరిగణనలోకి తీసుకోవాలి. అకారణంగా తిరస్కరించొద్దు.
- పీజీ విద్యార్థులు, ఇంటర్న్స్ ప్రధానంగా అభ్యసించడానికే ఉన్నారు కానీ సిబ్బంది కొరత తీర్చడానికి కాదు అనేది గుర్తించాలి.
- విద్యార్థులపై ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణను అమలు చేయాలి.
- యూజీ, పీజీ సిలబస్‌లో మానసిక వైద్య విద్యను సైతం భాగం చేయాలి. వర్క్‌షాప్‌లు, సదస్సులు నిర్వహించాలి.
- మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులకు యోగా తరగతులు, క్రీడలు నిర్వహించాలి.

# అదానీని ఆదుకొందాం!


- బంగ్లా సంక్షోభంతో అదానీ పవర్‌కు ఇబ్బందులు
- అధికార మార్పిడితో విద్యుత్తు డీల్‌పై నీలినీడలు
- ఇప్పటికే గొడ్డా ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి షురూ
- రంగంలోకి ఎన్డీయే సర్కారు.. నిబంధనల మార్పు
- బంగ్లాకు ఇవ్వాల్సిన కరెంటు.. ఇకపై దేశీయ గ్రిడ్‌లకు..
- అంతర్జాతీయ పత్రిక 'రాయిటర్స్'లో సంచలన కథనం
- ఆప్తమిత్రుడికి లబ్ధి చేకూర్చడానికేనని సర్వత్రా విమర్శలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): అదానీ గ్రూప్ కంపెనీకి చెందిన అదానీ పవర్‌కు మేలు చేసేలా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం విద్యుత్తు సవరణలు చేసింది. పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం అంతిమంగా అదానీ పవర్‌కు ఇబ్బందిగా మారడంతో సదరు కంపెనీ నష్టపోకుండా 2018లో తీసుకొచ్చిన రెగ్యులేటర్స్ సప్లయింగ్ ఎలక్ట్రిసిటీ నిబంధనలను కేంద్రం హడావుడిగా మార్చేసింది. సవరణలతో కూడిన మెమోను ఆగస్టు 12న విద్యుత్తుశాఖ జారీ చేసింది. ఈ మేరకు అంతర్జాతీయ పత్రిక 'రాయిటర్స్' ఓ సంచలన కథనంలో వెల్లడించింది.

**అసలేం జరిగింది?**

జార్ఖండ్‌లోని గొడ్డాలోని 1600 మెగావాట్ల సామర్థ్యం ఉన్న పవర్ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుత్తును బంగ్లా కొనుగోలు చేసేలా అదానీ పవర్ సంస్థ 2015 ఆగస్టులో బంగ్లాదేశ్‌లోని అప్పటి షేక్ హసీనా ప్రభుత్వంతో ఒక ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు అక్కడ రాజకీయ సంక్షోభంతో పవర్ డీల్‌పై నీలినీడలు కమ్మాయి. దీంతో కేంద్రంలోని ఎన్డీయే సర్కారు జోక్యం చేసుకొంది. 2018లో చేసుకొన్న ఒప్పందంలోని నిబంధనలను మార్చేసింది. గొడ్డాలోని అదానీ పవర్ ప్లాంట్.. దేశీయ గ్రిడ్లకు విద్యుత్తు సరఫరా చేసుకోవచ్చని కొత్త మెమో ఇచ్చింది. ఈ మేరకు రాయిటర్స్ వెల్లడించింది. అయితే, అదానీని ఆదుకొనేందుకే కేంద్రం ఈ నిబంధనలను పక్షపాతపూరితంగా మార్చేసిందని పలువురు విమర్శిస్తున్నారు.




### డీల్‌పై సర్వత్రా విమర్శలు

బంగ్లాదేశ్‌తో అదానీ కంపెనీ చేసుకొన్న పవర్ డీల్‌పై కూడా అప్పట్లో పెద్దయెత్తున విమర్శలు వచ్చాయి. ఈ ఒప్పందం కుదరడానికి ప్రధాని నరేంద్రమోదీ సాయపడ్డారన్న ఆరోపణలూ ఉన్నాయి. 2015 జూన్‌లో మోదీ బంగ్లాదేశ్‌లో పర్యటించారు. దౌత్య, వాణిజ్య సంబంధాల బలోపేతం పేరిట ఆ దేశంతో 4.5 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకొన్నారు. పరిశ్రమలు స్థాపించి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని అప్పటి ఆ దేశ ప్రధాని షేక్ హసీనాకు హామీనిచ్చారు. అయితే, దీనికి ప్రతిగా జార్ఖండ్ గొడ్డాలోని అదానీ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్తును కొనుగోలు చేయాలని, అదానీకి చెందిన విద్యుదుత్పత్తి, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను బంగ్లాలో స్థాపించేందుకు అనుమతినివ్వాలని మోదీ మెలికపెట్టినట్టు వార్తలు వచ్చాయి. కాగా, ఈ డీల్‌తో తాము నష్టపోతున్నట్టు గత ఏడాది బంగ్లాదేశ్ సవర్ డెవలప్‌మెంట్ బోర్డ్ (బీపీడీ) అదానీ కంపెనీకి ఓ లేఖ రాసింది.

# ఉక్రెయిన్ ఆధీనంలో రష్యా పట్టణం

- **మిలిటరీ కార్యాలయం ఏర్పాటు**
- **ప్రకటించిన అధ్యక్షుడు జెలెన్‌స్కీ**

కీవ్, ఆగస్టు 15: రష్యా - ఉక్రెయిన్ యుద్ధం కీలక మలుపు తిరిగింది. రష్యా భూభాగంలోని కుర్స్క్ ప్రాంతంలో ఉన్న సడ్జా పట్టణాన్ని తమ బలగాలు పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ గురువారం ప్రకటించారు. ఈ పట్టణంలో దాదాపు 5,000 జనాభా ఉన్నారు. పశ్చిమ సైబీరియా చమురు నిక్షేపాల నుంచి ప్రవహించే పైప్‌లైన్లు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. సడ్జా పట్టణంలో ఉక్రెయిన్ సైనిక కమాండర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు జెలెన్‌స్కీ ప్రకటించారు. కాగా, జనవరి నుంచి ఉక్రెయిన్‌లోని 1,175 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని రష్యా ఆక్రమించగా, ఇప్పుడు మొదటిసారిగా రష్యా భూభాగంలోని దాదాపు 800 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ఉక్రెయిన్ ఆక్రమించిందని వాషింగ్టన్ కేంద్రంగా పని చేసే ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ వార్ తెలిపింది.



సడ్జాలో ధ్వంసమైన ఒక ప్రాంతం

**నార్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్ పేలుళ్ల వెనుక ఉక్రెయిన్?**

రష్యా - యూరోప్ మధ్య ఉండే నార్డ్ స్ట్రీమ్ సహజ వాయువు పైప్‌లైన్‌ల పేలుళ్ల వెనుక ఉక్రెయిన్ బలగాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు వాల్ స్ట్రీట్ జర్నల్‌లో ఒక కథనం ప్రచురితమైంది. దీని ప్రకారం.. ఉక్రెయిన్‌పైకి రష్యా దండెత్తిన తర్వాత రష్యాను దెబ్బతీసేందుకు గానూ ఆ దేశం నుంచి యూరోప్ వెళ్లే నార్డ్ స్ట్రీమ్ 1, నార్డ్ స్ట్రీమ్ 2 పైప్‌లైన్లను పేల్చేయాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ఓ వ్యాపారవేత్త సూచించారు. ఈ మేరకు 2022 మేలో ఈ ప్రణాళిక అమలు చేయడానికి జెలెన్‌స్కీ ఆమోదం తెలిపారు. అయితే, ఈ విషయం అమెరికా నిఘా సంస్థ సీఐఏకి తెలిసి, ప్రణాళికను విరమించుకోవాలని కోరడంతో జెలెన్‌స్కీ వెనక్కు తగ్గారు. తర్వాత సెప్టెంబర్‌లో జెలెన్‌స్కీకి సంబంధం లేకుండానే అప్పటి ఉక్రెయిన్ సైనికాధికారి జలుజ్నీ ఒక ప్రణాళిక రచించి బాల్టిక్ సముద్రంలో పైప్‌లైన్లను పేల్చేయించారు. కాగా, ఈ వార్తలను ఉక్రెయిన్ ఖండించింది. పైప్‌లైన్ పేలుళ్లలో తమ ప్రమేయం లేదని పేర్కొన్నది.

# గాజాలో మృత్యుఘోష

- ***40 వేలు దాటిన మృతుల సంఖ్య***
- ***పార్కులు, వీధుల్లో శవాల ఖననం***

*న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ - హమాస్ యుద్ధంలో మృతుల సంఖ్య 40,000 దాటిపోయింది. మృతదేహాలను ఖననం చేయడానికి కుటుంబ సభ్యులు నానా కష్టాలు పడుతున్నారు. గాజా స్ట్రిప్‌లోని డెయిర్ అల్-బలాహ్ శ్మశాన వాటికలో సూర్యోదయం నుంచి సమాధుల తవ్వకాలు ప్రారంభమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న సమాధులను కూడా తెరచి, అంతస్థులుగా సమాధులను నిర్మిస్తున్నారు.*

***2 శాతం మంది మృతి..***

*గాజాలో మరణించిన వారి మృతదేహాలను ఇండ్ల పెరడు, మెట్ల క్రింద, రోడ్డు పక్క పార్కింగ్ లాట్స్‌లో ఖననం చేస్తున్నారు. గాజా స్ట్రిప్‌లో యుద్ధానికి ముందు ఉన్న జనాభాలో దాదాపు 2 శాతం మంది మరణించారని అధికారులు చెప్తున్నారు. వాస్తవంగా మరణించినవారి ఖననం చేసిన తేదీ, ఐడెంటిఫికేషన్ నంబర్, ఆ మృతదేహం ఎక్కడ దొరికింది? వంటి వివరాలను రాసి పెడుతున్నారు.*

***వెనక్కి తగ్గితే దైవాగ్రహం తప్పదు:*** *ఖమేనీ హమాస్ రాజకీయ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యతో ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇజ్రాయెల్‌పై దాడి విషయంలో వెనక్కి తగ్గితే దైవాగ్రహానికి గురికాక తప్పదని ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు.*



***బర్త్ సర్టిఫికెట్ తెచ్చేలోగానే..***

*ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో అనేక విషాదకర సంఘటనలు జరుగుతున్నాయి. తాజాగా జరిగిన దాడిలో నవజాత కవల శిశువులు, వారి తల్లి, అమ్మమ్మ ప్రాణాలు కోల్పోయారు. సెంట్రల్ గాజా స్ట్రిప్, డెయిర్ అల్ బాలాహ్‌లో మంగళవారం ఈ దారుణం జరిగింది. ఆ సమయంలో ఆ బిడ్డల తండ్రి మహమ్మద్ అల్ ఖుమ్సన్ వారి జననాలను నమోదు చేయించి, ధ్రువ పత్రాలను తీసుకొచ్చేందుకు ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లారు. ఆయన ప్రభుత్వ కార్యాలయంలో ఉండగానే వారి పొరుగింటివారు ఆయనకు ఫోన్ చేసి, ''మీ ఇంటి మీద బాంబులు వేశారు'' అని చెప్పారు. దీంతో ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. తమ బిడ్డల జనన ధ్రువీకరణ పత్రాలను విలేకర్లకు చూపుతూ, గుండెలు అవిసేలా రోదించారు. తమకు అస్సెర్ (బాలుడు), అయిస్సెల్ (బాలిక) శనివారం (ఈ నెల 10న) జన్మించారని, వారితో సంతోషంగా గడపటానికి తనకు సమయం చిక్కలేదని వాపోయారు.*